# అమ్మాయి ఆగమనం

రచన:
శ్రీ కాంచనపల్లి వెంకటరంగారావు

'పిలిచిన ప్రతిపండుగకు వెళితే మనకుబోలెడుఖర్చని దసరాకురానేలేదు. పోనీ దీపావళికైనాతప్పకుండా రమ్మని అల్లుడికిరాయండి' అంది భార్య ఉదయం కాఫీ యిస్తూ.

'నేనూ రాయాలనే అనుకుంటున్నాను. ఆఫీసుకెళ్ళిన తర్వాత తప్పకుండా ఒక కార్డువ్రాసి పడేస్తానులే' అన్నాడు భర్త సిగరెట్టు పొగవదుల్తూ.

'మీరిట్లా అనుకుంటూ అప్పుడే పదిరోజులు అయిపోయింది. నాదగ్గర కార్డువుంది. ఇప్పుడు తీరుబాటుగానే వున్నారుగా, వ్రాసేసి నాకివ్వండి. అబ్బాయిచేత పోస్టు చేయిస్తా' అంది భార్య.

'అయితే నీకు నమ్మకం లేదన్నమాట.' 'నమ్మకం సంగతికాదండి. ఆఫీసుగొడవలలో మీకు జ్ఞాపకం వుంటుందో వుండదో అని.'

'సరే యిట్లాతే ఆకార్డు.' అని అడిగిపుచ్చుకొని అమలాపురంలోవున్న అల్లుడికివ్రాశాడు యీ అమావాశ్యకైనా మీరిద్దరు తప్పక రావలసిందని.

\+ \+ \+

కాలేజీకి బయలుదేరబోతున్న అల్లుడికి గుర్తులోనే పోస్టుమేను కార్డుయిచ్చి వెళ్ళిపోయాడు. నిత్యం టపాకోసం ఎదురుచూస్తున్న కాంతం-కామేశ్వర్రావు ఆకార్డు అటూ యిటూ లాక్కుంటూ పెనగులాడుకున్నారు. మొత్తంమీద ఆ కార్డులోని ఆహ్వానం యిద్దరు ఆనందంగా చదువుకున్నారు. ఒక గంటముందుగా రావాలిసుమండి యివాళ అంటూ కాంతం లోపలికిపోయింది. కామేశ్వర్రావు చూద్దాములే అంటు కాలేజికి గబగబ వెళ్ళిపోయాడు.

\+ \+ \+

రాత్రి పదిగంటలు దాటింది. ఈమెయిలులో అమ్మాయి-అల్లుడు తప్పక రావచ్చుననే ఆశతో తల్లిదండ్రులు గుమ్మంముందు నిరీక్షిస్తున్నారు. అనుకున్నట్లుగానే చిలకా-గోరెంకల్లాగ యిద్దరూ రిక్షాలోదిగారు. కూతుర్ని తీసుకొని చేతంట ముఖంతో తల్లి లోపలికిపోయింది. అల్లుడ్ని ఆప్యాయంగా మామగారు పలకరించారు.

కూతురు-అమ్మా! తమ్ముడేంచేస్తున్నాడే! అప్పుడే పడుకున్నాడా? ఇవాళ మేము వస్తామని వాడికి తెలుసా?

తల్లి-అసలు రెండురోజులై పలవరిస్తున్నాడనుకో 'అక్కా-బావవస్తారు, అన్నీ నాకుతెస్తారు' అనిపాటలు కూడాను. ఇంతవరకూ చదువుతూనే వున్నాడు. నిద్రపోయాడో ఏమిటో! లేపుతానుండు అంటూ కొడుకు చదువుకుంటూవుండే గదిలోకి వెళ్ళి 'ఒరే బాబూ! నాన్నా!! అక్క-బావ వచ్చారు. నీకోసం ఏమిటో చాలాతెచ్చారు. లే. కళ్ళుతెరు' అంటూ తల్లిలేపింది. పక్కలోకూర్చుని తమ్ముడ్ని అక్కలేపేసింది. ఈలోగా రిక్షాలోనుంచి దించిన సామాన్లు ఆ గదిలో తల్లీ ఒక మూలకు పెట్టింది.

ఎప్పుడు భోంచేశారో ఏమిటో లేవండి భోజనానికి అని తల్లి అల్లుడ్ని కూతుర్ని తొందరచేసింది. మీరిద్దరు ఒకేమారు తినండే అని తల్లిఅంటే మనంయిద్దరం కలిసి తిందామే అని కూతురంది. అల్లుడుమాత్రం భోంచేసి పైనకూర్చున్న మామగారితో తన కాలేజీసంగతులు యింటివిషయాలు ఏవోవో మాట్లాడుతున్నాడు.

తల్లి-కూతురు వంటింట్లో ఒక అరగంటవరకూ యిరుగుపొరుగు సంగతులు చెప్పుకున్నారు. ఈలోగా తమ్ముడులేచివస్తాడని ఆగదిలో తాను పడుకుందామని కాంతం అనుకుంది. కాని యింకా లేవకపోవడంచేత 'నేను లేపుతానుండే వాడ్ని' అంటూ తల్లిగదిలో ప్రవేశించింది.

తల్లి-అక్కకోసం అంత పలవరించావుగదా తీరా వస్తేదానితో మాట్లాడవేమిరా?

కొడుకు-మాట్లాడ్డానికి యిప్పుడే మీమాటలు లేవు లెద్దు.

తల్లి-లేకపోతే మానేగాని యీగది ఖాళీచేసి నీవు హాల్లోపడుకో.

కొడుకు-హాల్లో దాన్నేపడుకోమను విశాలంగా, లేకపోతే యిక్కడే పడుకోమను. నేను మాత్రం లేవను.

తల్లి-బావకూడా వచ్చారని తెలుసా? వాళ్ళున్నంత వరకు యీగదివాళ్ళది.

కొడుకు-అయితే ఎప్పుడు వెళ్ళిపోతారేమిటి?

తల్లి-ఛీ వెధవ వచ్చియింకా 2 గంటలైనా కాలేదు, అప్పుడే ఎప్పుడు వెళ్ళిపోతారని అడుగుతావేమిటి?

ఈ సంభాషణ అంతా వింటున్న అల్లుడు 'నేను యిక్కడే పడుకుంటాను. ఈ వరండాలో మీ అమ్మాయిని నా పక్కపడేయమని చెప్పండి. నిద్రమత్తుయింకా వదలని అతన్ని ఎందుకు అల్లరిపెడతారు' అన్నాడు మర్యాదకోసం.

మామగారు-ఈమధ్య మా వెధవకి మరీ మంకుతనం, ముద్దుజాస్తీ అయిందండి. అంటూ లోపలికి వెళ్ళి' ఇంకా లేచాడా లేదా? గాడిదకు మర్యాదకూడా తెలియకుండా పోతోంది.' అన్నాడు గట్టిగా.

కాంతం-'మీరు వెళ్ళండి నాన్నగారు. వాడ్ని నేను లేపుతాను అని అంటూ ఏవో బురదుకబుర్లు చెప్పి తమ్ముడ్ని లేవతీసింది. వాడు మూలుగుతూ తన పుస్తకాలుపట్టుకొని నట్టింట్లోకి పోయికూర్చున్నాడు. తల్లి మరోపక్క లేని మంచిమాటలు చెప్పి పడుకోబెట్టింది.

\+ \+ \+

ఉదయం ఏడుగంటలు దాటేసరికి కాఫీ అల్పాహారంలో సహా పూర్తిఅయింది. పెట్టెతీసి తమ్ముడికోసం తెచ్చిన రడీమేడ్ డ్రెస్ వాడిచేతిలో పెట్టింది. అక్కమీదవచ్చినకోపం అంతా చల్లారిపోయింది.

'నాన్నకుట్టించిన డ్రెస్సులకంటే నీవు తెచ్చినవే బాగున్నాయి' అంటూ తన పెట్టెలో పెట్టుకున్నాడు. దీపావళికి కాల్చుకోవలసినవి యింకా నాన్నకొనేలేదు అంటూ అక్కా-బావ వైపు మాస్తూ అన్నాడు. దుకాణాలుతీసిన తర్వాత బావకొంటారు లే అని అక్క అభయం యిచ్చింది.

ఇంతలో గంపనిండా పెరుగుపిడతలు పెట్టుకొని వయ్యారంగా ఒక గొల్లపడుచువచ్చి గుమ్మంలో కూర్చుంది.

పెరట్లోనున్న తల్లి కూతుర్ని పిలిచి దానిదగ్గర రెండు చేడపిడతలు తీసుకో అంది. నేమకూడా ఒక అణాపిడత తీసుకుంటానన్నాడు కొడుకు. ఒక పిడత కాదు .రెండు పిడతలు తీసుకోవోయ్ అన్నాడు బావ హాస్యంగా.

ఎక్కడున్నా పిడత బేరాలు మాత్రంమానరుఅన్నది. కాంతం భర్తహాస్యం గుర్తించినట్లు చిలిపిగా. మాబావను చూశావా ఎప్పుడైనా? మాబావ యిక్కడున్నంతకాలం మంచిపిడతలు తేవాలిసుమా! గట్టిపెరుగంటే మాబావకెంతోయిష్టం అన్నాడు కాంతం తమ్ముడు.

గొల్లపడుచు-ఎంత యిష్టమో తెలుస్తూనేవుంది లెండి.

కాంతం-ఏమిటి తెలుస్తోందే నీముఖం?

గొల్ల-నాముఖం కాదండి. అమ్మగారు యిదివరకే చెప్పారు. మా అల్లుడు-కూతురు వస్తారు. గట్టిపెరుగు ప్రత్యేకంగా తోడిపెట్టుకురావే గొల్లా అని.

కాంతం-మాటల చాలాకే నీకు బాగావుందే.

గొల్ల-పదియిళ్ళకు తెల్లవారుతే వెళతాముగదా యీమాత్రం మాటలురాకపోతే ఎలాగండి?

తమ్ముడు-మీవూళ్ళోకూడా యిట్లాంటి సినీమాష్టారు గొల్లదివుందా బావా?

కామేశ్వరరావు-వుంటారుగాని మీ అక్కరా నివ్వదోయ్.

తమ్ముడు-అయితే దీన్ని తీసుకుపో బావ. నీకురోజూ మంచిపెరుగు దొరుకుతుంది.

మీమాటలకేంగాని అంటూ గోడమీద అదనంగా యిచ్చినపిడతల చుక్కలు పెట్టేసి గొల్ల వెళ్లిపోయింది. షుమారు తొమ్మిదిగంటలకు అందరితలంట్లు అయిపోయాం. అక్క తెచ్చిన డ్రెస్సు వేసుకొని 'బావా! బజారుకు వెళదాం పద అన్నాడు తమ్ముడు. వాడికేంకావాలో కొనియివ్వండి అని కాంతం ఆర్డరు వేసింది. ఇద్దరూ బజారు బయలుదేరారు. త్రోవలో ఒక పెద్దకాఫీహోటేలు చూపెట్టి 'మీవూళ్ళో యిల్లాంటి కాఫీహోటేలు ఒక్కటైనా వుందా? ఇక్కడికాఫీ ఒకమారు త్రాగుతే యీవూరువదలరు' అన్నాడు ఆ కాఫీత్రాగాలన్నట్లుగా. అంత బాగుంటుందా? అయితే పదచూద్దాం అన్నాడు బావ. కూర్చోగానే సర్వరువచ్చాడు. మాబావకు 4 నాకు 2 ఇడ్లీపట్టుకురా అన్నాడు. ఆతర్వాత పూరీలు కూడా అదేసంఖ్యలో ఆర్డరుచేశాడు. వద్దంటే తనలో భత్యం బయటపడుతుందేమో అని వూరుకున్నాడు. ఆ తర్వాత కాఫీలు తెమ్మన్నాడు. కాఫీయినూ బల్లమీద బిల్లుపెట్టి సర్వరువెళ్ళిపోయాడు. బావముఖం తెల్లపోయింది. బావమరిది కడుపునిండిపోయింది.

ఈపూటకు యీ కాఫీహోటేలు చాలులే. సాయంత్రం మరొకటి యిల్లాంటిదే చూపెడతానంటూ బయటవున్న కిళ్లీకొట్టుముందు ఆగాడు దర్జాగా విధిలేక 2 కిళ్లీలు, 2 సిగరెట్లుతీసుకొని రోడ్డుఎక్కారు. ఆ రోడ్డుమలుపులోనేయున్న ఒకయిల్లు చూపెడుతు ఇదేమాప్రైవే

గత 54 సంవత్సరములనుంచీ
ప్రసిద్ధి చెందినది.




మంచి ఆకుతోను, శ్రేష్ఠమైన పొగాకుతోనూ
తయారించిన
సమద్, జాడి & సాదా
బీడీలనే వాడి, ఆనందించండి.
——— తయారించువారు ———
సమద్ బీడీ ఫేక్టరి
వేలూరు (N.A.)
ఫోన్: ఆఫీసు 246. రెసిడెన్సు: 124.

టు మేష్టారి యిల్లు. వస్తావా బావా నిన్ను ఆయనకు చూపెడతాను అన్నాడు. తనుకూడా మేష్టరేగనుక బావమరిది తెలివితేటలు ఎట్లాగున్నాయో అడిగి తెలుసుకుందామనే వుద్దేశంతో సరేనన్నాడు కామేశ్వరరావు. మడత లుంగ కట్టిన మెడలో ఒకవైపు ఆడపిల్లలు-మరోవైపు మొగపిల్లలని పెట్టుకొని ఆయన ఆ న్యూసెన్సుకైనలువారికి బోధిస్తున్నాడు.

'ఈయన మాబావగారండి రాత్రివచ్చారు. నేనే తీసుకొనివచ్చాను మిమ్మల్ని చూపెడదామని' అన్నాడు.

'దయచెయ్యండి లోపలికి అంటూ ఆయన ఆహ్వానించాడు. ఆ తర్వాత యిద్దరు తమతమ కాలేజి భోగట్టాలు, ప్రైవేటుట్యూషన్సు యిత్యాదివిషయాలు ఏకేవో మాట్లాడుకున్నారు. మాటలసందర్భములో 'మీ బావమరిది సీమ మెరపకాయలాంటి వాడండి. వయస్సుకమించిన తెలివి, ప్రైవేటుట్యూషన్సు పేరుతో ప్రైవేటుసంగతులు కూపీలాగే డిటెక్టివ్‌లాంటి వాడండి' అని పొగిడాడు.

మరేమైనా చెపుతాడేమోననే సంశయంతో 'మళ్లీ వస్తామండీ' అంటూ బావనుబయలుదేరతీశాడు. ఆ ప్రైవేటు మేష్టరుగారి గుమ్మానికెదురుగానున్న ఒకగోడమీద 'మంచినడతకు మడత మేష్టరు' అనే పెద్దక్షరాలు తారుతో వ్రాసివున్నాయి.

'ఇప్పుడు మనంచూసిన ఆయనేనా ఆమడత మేష్టరు అని బావగారు అంటూవుంటే' ఒక్కమడత మేష్టరే గాదు పిడత మేష్టరుకూడావున్నాడు అని బావమరిది వెంటనే అందుకున్నాడు. తానుపిడత మేష్టరు అనే విషయం యీ వెధవకి ఎట్లా తెలిసిందా అని లోపల అనుకుంటూ మరావిషయం ఎత్తకుండా బజారులోకి వెళ్లారు.

అయిదురూపాయిలవరకు తనకు కావలసిన దీపావళి సరుకులనిపించాడు. ఇక చాల్లే బావా యీపూటకు అంటూ యిద్దరు యింటికిపోయారు.

కొనుక్కొని వచ్చినవన్నీ చూచి భర్తతాలూకు దర్జాకు భార్య, అల్లుడిత్యాగానికి అత్తలో లోపలమురిశారు. తమ్ముడుమాత్రం బావగారు చాలామంచివారే అని పొగిడేస్తున్నాడు ధట్రాజులాగ.

బజారుకేవెళ్ళారా, మరెక్కడికైనా తీసుకువెళ్లాడా అని కాంతం అడిగింది, త్రోవలోజరిగినవన్నీ పూసగుచ్చినట్లుభర్త చెప్పేశాడు. కాంతంతమ్ముడు అమందుసామానులు ఎండలో పెడుతున్నాడు. తల్లివంట యింట్లోవుంది. ఇదేసమయమని కాంతం భర్తవైపుచూస్తూ' మడత మేష్టరుపేరు ఎందుకువచ్చిందండి? అని అడిగింది.

కామేశ్వరరావు-మా ప్రైవేటు మేష్టరు పేరు మడత మేష్టరని చెపుతూ వాళ్లింట్లోవున్న మడతకాసిస్టర్సుని కూడా చూపెట్టాడు.

కాంతం-అయితే వూరంతా చుట్టబెట్టివచ్చారన్న మాట. ఇవాళమడత మేష్టరుగారి యిల్లుచూపెట్టాడు. రేపుపిడత మేష్టరునుకూడా చూపెడతాడు, వాడువూరి

వచ్చిపోకిరి పాడకట్టు అయిపోతున్నాడు. వాడికెట్లా తెలిసిందండీ మీరుపిడతమేష్టరు అయినట్లు? (అన్నది మెల్లిగా)

కామేశ్వర్రావు - నేను చెప్పాననుకుంటున్నావా ఏమిటియింతోటి యీబిరుదుగూర్చి. అతనే అన్నాడు ఒక్క మడతమేష్టరేకాకుండా యింకా పిడతమేష్టరు, చిట్టామేష్టరు, దమ్ముమేష్టరు, టెంపర్ మేష్టరు, పేకాట, పెరుగ్గారె, వంకాయ, బంగాళాదుంప మొదలైన యిల్లాంటి పేర్లే యిక్కడిమేష్టర్లందరికి వున్నాయని చెప్పాడు. మీ బావను పిడతమేష్టరు అంటారని బహుశానీవుగాని చెప్పావేమో అని అనుకుంటున్నాను. నీవు చెప్పనేలేదన్నమాట. అయితే యీనిసింద్రీదగ్గిర చాలా జాగ్రత్తగా వుండాలిసిందే.

తమ్ముడు_బావా! బావా!! ఈమచ్చుపటాకే చూస్తా వాకాలుస్తాను అంటూ అక్కగదిలోకి వచ్చాడు.

అక్క_బావను లేపకురా. తెల్లవార్లునిద్రలేదుపాపం నేను చూస్తాను కాల్చు మతాపా.

తమ్ముడు_ఒక్క పటాస్ కాయి గదిగోడకు కొట్టానా అంటే నిద్రాగిద్రా వదిలిపోతుంది.

అక్క_అపనే నీవు చేస్తే బావనిద్రావదిలిపోతుంది, నీవీపు విమానం మోతమోగిపోతుంది.

తమ్ముడు_బావనుగాని ఆ విమానంమీద ఎక్కించానా అంటే యిద్దరికీ ఒకేమారు మోతమోగుతుంది అంటూ వాకిట్లోకిపోయాడు తను లేకపోతే అవి బాగా ఎండవేమో అని.

\+ + +

పన్నెండు కొట్టకముందే అత్తగారు అందర్నిభోజనాలకు లెమ్మని హెచ్చరించింది. మామగారు, అల్లుడు, కొడుకు వరుసగా పీటలమీద కూర్చున్నారు. నలుగురికి ఒకేమారువడ్డిస్తా నీవుకూడా కూర్చో అని తల్లికూతుర్ని అన్నప్పటికి మనిద్దరం ఒకమారు తిందాములేవే అంటూ కాంతం నేతిగిన్నె పట్టుకొని నిలబడింది. సేమ్యాపాయసానికి సరియైనపాలుదొరకలేదని తల్లి అంటే, పోనీమంచి పిడతపెరుగువుందిగా బావకు అని కొడుకు అందుకున్నాడు. పిడతమాట ఎత్తినపుడల్లా అక్కముఖంవాడిపోతోంది. బావముఖం తెల్లబోతోంది. కాని ఏమన్నా అంటే మరీ రెచ్చిపోతాడని ఆమాటలువినీ విననట్లు అక్కబావ వూరుకున్నారు. 'నోరుమూయరావాక్క' అని తండ్రికేకలువేశాడు. పండుగపూటా కూడా వాడికి చీవాట్లుతప్పవు. ఏదో అనడం, తిట్లుతినడం వాడికి అలవాటు అయిపోయింది అని తల్లి కొడుకుని వెనకేసుకొచ్చినట్లు భర్త ఆగ్రహాన్ని కొంచెం అదుపులోకి తెచ్చింది.

కొడుకు గబగబతినేసి లేవబోతూవుంటే పెద్దవాళ్ళు లేవంది నీవు లేవకూడదు అన్నట్లు తల్లి సౌంజ్ఞ చేసింది. తర్వాత అందరూ ఒకేమారులేచి హాల్లోకివచ్చేశారు. కూతురు తనభర్తకీ, తండ్రికి ఆకులుచుట్టిపళ్లెంలో పెట్టింది విడిగాకొన్ని ఆకులు_లవంగాలు_ఏలకులుకూడా అందులో వుంచింది చాలకపోతే వేసుకుంటారని.

చేతులుతుడుచుకొని పట్టుబట్టలు విప్పేలోగా తమ్ముడు కొన్ని ఆకులు, వక్కలుతీసుకొని పైకివెళ్లి మందుసామాన్లు ఎంతవరకూ ఎండాయో చూస్తూనిలబడ్డాడు.

(తరువాయి 62 పేజీలో)

BRK TOWELS MDU
Our Hearty Diwali Greetings
Our Patrons and Well Wishers !!
Manufacturers &
Merchants
Of
B. R. KRISHNAIER & SONS
16, Mahal 4th Street,
MADURAI-1 (S. I.)
"MANOHAR"
SAREES
MADE IN INDIA

(57వ పేజీ తరువాయి)

తాంబూలాలు వేసుకొని అల్లుడు-మామ విశ్రాంతితీసుకుంటున్నారు. తల్లి-కూతురు కబుర్లుచెప్పుకుంటూ సరీగ్గా ఒకగంటసేపటికి భోజనానంతరం పైకివచ్చారు.

కూతురికోసం తెప్పించిన వాయిల్ చీర - జాకెట్ గుడ్డ, అల్లుడినిమిత్తం కొన్న సెలం పంచలచాపు చూపెట్టింది.

అవి చూస్తూనే 'సరేగాని మరి నాన్నగారికి నీకు ఏవి కొత్తబట్టలు' అని వేదనగా అడిగిందికాంతం.

మీ ముద్దుముచ్చటలు మేముచూడాలిగాని మాకు యింకా పండుగలు, కొత్తబట్టలు ఏమిటితల్లీ?

అయితే మీకు లేకుండా మాకు యివన్నీ అప్పుచేసికొనిపెట్టకపోతేనేం! మన పరిస్థితి నాకు తెలియదా ఏమిటి?

'నేను బ్రతికివున్నంతవరకు యిట్లా జరిగిపోనిదు ఎంతమందివున్నారు గనుక ఏముద్దుముచ్చటలకైనా నీవు తమ్ముడేగదూ! అందరం యిప్పటికి దైవకృపవల్ల కులాసాగావున్నాము. పైసంవత్సరం ఎవరం ఎట్లావుంటామో!' అంటూ కూతురుపాదాలకు పసుపుపారాయినా పెట్టి, నుదుటకుంకుమదిద్ది, ఆశీర్వదించి కొత్తచీరకట్టుకోమనియిచ్చింది. నీభర్త లేచినతర్వాత మీనాన్న ఆయనకు ఆ బట్టలుయిస్తారులే అంది.

కొత్తచీర తానుకట్టుకునేముందు వుండే అమ్మా అంటూ తనట్రంకు పెట్టెతీసి తల్లికి-తండ్రికికూడా తెచ్చిన బట్టలు తల్లిముందుపెట్టింది. తల్లి ఆశ్చర్యపోయింది. ఆనందాశ్రువులు బొటబొటరాలాయి. కాపురానికి వెళ్ళిపో పుట్టింటిమీద యింకా దీనికెంత అభిమానం అని లోపల అనుకుంటూ 'మనబీదబ్రతుకు మొదటినుంచి నీకు తెలుసునుగనుక యిట్లాచేశావుగాని మరేబిడ్డ యిట్లా ఆదరిస్తుందితల్లి అని బుగ్గలు ముద్దులాడి కళ్ళతడిపెట్టింది. సంతోషంగావుండవలసిన యివాళ ఏమిటి అమ్మాయీ విచారం! నేను బ్రతికివున్నంతవరకు మీకు తమ్ముడికి ఏమిలోటు రానివ్వను అని ధైర్యంచెప్పి దుఃఖాన్ని ఉపగమింపచేసింది.

మూడు అయ్యేసరికి తండ్రిలేచాడు. లేచే లేవడంతల్లి తనభర్త కాళ్ళకు నమస్కారంచేసింది. ఆకొత్తచీరచూచి ఆశ్చర్యపడ్డాడు. ఇదంతా కూతురు అభిమానంగదా అని అనుకుంటూ వుండేవేళకు తండ్రిపాదాలకునమస్కరించి ఆయన దీవన అందుకుంటూ 'ఇదిగోనాన్న - మీకోసం తెచ్చాను. మీరు కట్టుకోడానికి తెచ్చేటంతటి శక్తి యీనాటికి భగవంతుడు మాకుప్రసాదించాడు. మీరు కాదనకుండా యివి కట్టుకోవాలి అంటూ తండ్రిపక్కనే కూర్చుంది గారాబంగా.

నాచిట్టి తల్లికిమనమీద ఎంత అభిమానం! దారిద్రానికి-అభిమానానికి ఎంతదూరం వుందో యిప్పుడు నేను తెలుసుకోగలిగాను. అంటూ ఒక్కదగ్గరగా తల్లితండ్రి కూతురు భావనకు అతీతమైన ఆనందంలో మునిగి, కూర్చుండిపోయారు లోలోపల అన్నీ దిగమింగుతూ.

ఇంతలో కొడుకువచ్చి అమ్మా! బావకు కాఫీ. ఫలహారంపెట్టే అన్నాడు. తనకుకూడా దొరుకుతుందిగదా అనే ఆశతో. ఇదేవంకగా పెట్టుకొని తల్లికూతురిచేత తండ్రికి, అల్లుడికి ఫలహారంపంపించింది. కొడుకు తన ఫలహారం తానే తెచ్చుకొని నీళ్ళముందు కూర్చున్నాడు. యథాప్రకారం కాఫీలుకూడా అయిపోయాయి.

ఎప్పుడు చీకటిపడుతుందా కాల్చిపారేద్దామని చూస్తున్నతమ్ముడు ప్రమిదలలో దీపాలు వెలిగించమని మారాంపెట్టాడు. వూరందరి దీపాలముందు తనదీపాలు సరిచూచుకుంటూ పావుగంటలో అవన్నీ యీపులేకుండా కాల్చి, పేల్చి, మసిచేసి చేతులుదులుపుకున్నాడు. ఊళ్లో వాళ్ళు కాలుస్తూవుంటే చూడాలనిందేగాని తనవద్ద మాత్రం ఒక్కమతాపాకూడా లేదు.

కొడుకు-కూతురు-అల్లుడి నిమిత్తం తాను కూడా ఏవైనాకాల్చుకునేవి తేవాలని అనుకున్నాడుగాని 'ఎందుకునాన్నా! ఆయనతెచ్చినవేచాలు మరికొనకండి అని కూతురు అంటే ఆ ప్రయత్నం తండ్రి విరమించుకున్నాడు. అంతటితో అమావాశ్య గడిచిపోయింది.

ఉదయం పదిగంటలబండీకే వెళ్ళిపోవాలని, సెలవు లేదని అల్లుడు అంటే సరే అనకతప్పిందిగాదు.

కొడుకు-మళ్లా ఎప్పుడు వస్తారే అక్కా-బావాను?

తల్లి-భగవంతుడు మేలుచేస్తే సంక్రాంతికివస్తారు. వాళ్ళురాకపోతే నీవే వెళ్ళితీసికొద్దుగానిలే అని అంటూ తల్లి తిరిగి వారిరాకనుగూర్చి హెచ్చరించింది.

తల్లిదండ్రుల ఆశీర్వచనాలతో కాంతం-కామేశ్వర్రావు బండీఎక్కారు. స్టేషనుదాకా వెళ్ళి రైలు ఎక్కించివస్తానని కొడుకు అంటూవుండగా జట్కాబండీ సాగిపోయింది.

కళ్ళుతుడుచుకుంటూ తల్లిలోపలికి వెళ్ళింది. ఎంతకాలం మనయింట్లో వుండిపోతుంది చెప్పు. మళ్ళీవస్తుందిగా సంక్రాంతికి అని భర్త సమాగాయించాడు. మనం ఎంత బీదవాళ్ళం అయినా ఆడపిల్లకు పుట్టింటిమీద అభిమానంపోదుగదూ!

ప్రేమ నశించదుగదూ!
గౌరవం సన్నగిల్లదుగదూ!

అంటూ ఈజీఛైరులో తండ్రినడుం వాల్చాడు. మిగతాపనులలో తల్లి మునిగిపోయింది.